
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 9 జూన్ 2025



ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ విధానంలో గత నెల నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. పదో తరగతిలో సిద్దిపేట జిల్లాలో 579 మందికి 355 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్‌లో 928 మందికి 530 ఉత్తీర్ణులయ్యారు. సందేహాలకు 8008403635 నంబర్‌ను సంప్రదించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.



ఇంగువ బెల్లం పంపిణీ

సిద్దిపేట కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మృగశిర కార్తె సందర్భంగా సిద్దిపేట రైతు బజార్ వద్ద సుభాష్ రోడ్డు దర్గా కమిటీ ఆధ్వర్యంలో రైతులకు ఇంగువ బెల్లంను పంపిణీ చేశారు. ఈ మిశ్రమం తీసుకోవటం వలన ఉబ్బసం వ్యాధికి ఔషధంగా పనిచేస్తుందని సామాజిక కార్యకర్త గౌస్ బాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఈవో ప్రభాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మృగశిర సందడి

మృగశిర కార్తె సందర్భంగా సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోని చేపల మార్కెట్లో ఆదివారం ప్రజలు చేపల కోసం బారులు తీరారు. పైగా ఆదివారం కావడంతో చేపలకు గిరాకీ బాగానే పెరిగింది. ప్రతిరోజు కంటే కిలో చాపలపై రూ.50 అదనంగా తీసుకున్నారని వినియోగదారులు తెలిపారు. కొర్ర రూ.500, బొమ్మెలు రూ.400, బంగారు తీగలు రూ.150, బొచ్చ రూ.150, పామ్‌ప్లేట్ రూ.100, గుర్జల్లు రూ.350, రొయ్యలు రూ.450 ధర పలకాయి. వీటిని శుభ్రపరచడానికి కిలోకు రూ.30 చొప్పున అదనంగా తీసుకున్నారు. - జిల్లా ఫొటోగ్రాఫర్, జూన్ 8







హుస్నాబాద్ పట్టణం రామవరం రోడ్డులోని చేపల మార్కెట్‌కు కొనుగోలుదారులు భారీగా వచ్చారు. - హుస్నాబాద్, జూన్ 8

మాస్టార్లు

అంకితభావంతో పనిచేస్తూ.. వృత్తికి వన్నె తెస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

సర్కారు బడులపై పెరుగుతున్న నమ్మకం

పాఠశాలలను ఆదర్శంగా నిలుపుతున్న టీచర్లు



దుబ్బాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తమ వినూత్న ఆలోచనలను ఆచరణలో పెడుతూ, సరికొత్త పద్ధతులతో విద్యాబోధన చేస్తూ, విద్యార్థులను ఉత్తమంగా నిలిపేందుకు ప్రయత్నిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తూ.. తమ వృత్తికి వన్నె తీసుకొస్తున్నారు కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు. సర్కారు పాఠశాలలపై నమ్మకాన్ని పెంపొందించేందుకు తమవంతుగా పాటుపడుతున్న మాస్టార్లు నిజంగానే స్టార్లుగా నిలుస్తున్నారు.

అవిశ్రాంత బోధనా యోధుడు.. సాయికృష్ణమూర్తి

మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌లో ఎస్‌జీటీగా పని చేస్తున్న సాయికృష్ణమూర్తి ఐదేళ్లుగా ఒక్క సెలవు తీసుకోకుండా పని చేస్తున్నారు. తాను బోధిస్తున్న విద్యాలయం ఉత్తమంగా నిలవాలనే ఉద్దేశంతో అదనంగా గంటపాటు పాఠాలను చెబుతున్నారు. ప్రతీ రోజు ఉదయం ఎనిమిది గంటలకే పాఠశాలకు వెళ్లి విద్యార్థుల చదువు కోసం కృషి చేస్తున్న సాయికృష్ణమూర్తి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్కారం పొందారు. ఆయన కృషితో కాసులాబాద్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది.



అట్ట, పేపర్ ముక్కలతో చేసిన వాటితో విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధన అందిస్తున్న మాధవి

వినూత్న బోధన



దుబ్బాక మండలం గంబీర్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న ఉప్పునూతుల మాధవి ఉత్తమ అభ్యాసనతో అందరి మన్ననలు పొందుతున్నారు. మారుమూల గ్రామంలోని విద్యార్థులకు సులువుగా పాఠాలు వంటపట్టేందుకు అట్టముక్కలు, పేపర్‌ముక్కలతో వినూత్న బోధనను అందిస్తున్నది. ఆమె కృషిని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు. ఆమె నాలుగు రోజుల క్రితం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో రాష్ట్రస్థాయి అధికారులకు విద్యాబోధన పద్ధతులను వివరించారు. గతంలో 2024-25లో రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ ప్రచురించిన హర్బింజర్ ఆఫ్ చేంజ్ పుస్తకంలో మాధవి సక్సెస్ స్టోరీని ప్రచురించారు.

పిల్లలు సర్కారు స్కూళ్లకే



దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన ముదిగొండ భగవాన్ మండలంలోని ఆకారం గ్రామంలో 2018లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అప్పటికి ఆ పాఠశాలల్లో 46 మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామంలోని విద్యార్థులను తన పాఠశాలల్లో చేరాల్సిందిగా కోరే ముందు తన పిల్లలను చేర్పించి, వారిని కోరితే బాగుంటుందని భావించాడు. తన పెద్ద కూతురు మనస్విని, చిన్నకూతురు తేజస్విని అక్కడే చేర్పించారు. ఇప్పుడు మనస్విని లచ్చపేట మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుంది. తేజస్విని తండ్రితో పాటు అదే స్కూల్‌లో 4వ తరగతి చదువుతుంది. తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ, భగవాన్ అందరికీ ఆదర్శంగా నిలిచారు. తనతోనే మార్పు రావాలని భావించిన ఆయన తన పాఠశాల సంఖ్యను 97కు చేర్చారు. తన ఆదర్శానికి 2022లో కలెక్టర్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారాన్ని అందుకున్నారు.

భళా పోతారం పాఠశాల



యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేసిన పోతారం విద్యార్థిని చెప్పిన నీతి కథ థంబ్‌నైల్

దుబ్బాక మండలం పోతారం ప్రాథమిక పాఠశాల సాంకేతికత వినియోగంలో మేటిగా నిలుస్తున్నది. ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండగా 40 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తున్నారు. టీచర్లు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)ను విరివిగా ఉపయోగించి విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీస్తున్నారు. ఏఐతో పాటు యూట్యూబ్ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయిస్తున్నారు. పోతారం స్కూల్ పేరుతో యూట్యూబ్ చానల్‌ను నిర్వహిస్తున్నారు. ఆ చానల్‌లో విద్యార్థుల నైపుణ్యాలను అప్‌లోడ్ చేస్తున్నారు. విద్యార్థులతోనే ఫోన్‌లో రికార్డు చేయించి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పలు బోధనలను యూట్యూబ్ ద్వారానే అందిస్తున్నారు. ఏఐ ద్వారా పాఠ్యాంశాలను పాటలుగా మార్చి, విద్యార్థులకు నేర్పుతున్నారు. ఈవినూత్న ప్రయత్నంతో విద్యార్థులు సర్కారు బడివైపు దృష్టి సారించడంతోపాటు, విద్యార్థుల్లో ప్రస్తుత పోటీ ప్రపంచంలోని సామర్థ్యాల స్థాయి పెరుగుతుంది.

మెలకువలు పాటిస్తే.. లాభాల పంట

రైతు మహోత్సవం విజయవంతం చేసిన అధికారులకు కృతజ్ఞతలు : కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రైతు మహోత్సవంలో నేర్చుకున్న మెలకువలను పాటిస్తే లాభాల పంట పండుతుందని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో మూడోరోజైన ఆదివారం నిర్వహించిన రైతు మహోత్సవ సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేట జిల్లాతో పాటు చుట్టు మూడు జిల్లాలు దగ్గర, దగ్గరగా ఉండడంతోనే ఈ కార్యక్రమాన్ని హుస్నాబాద్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. అరటి సాగులో దేశంలో 13 శాతం, ప్రపంచంలో 2 శాతం మహరాష్ట్ర నుంచే వస్తుందని, అందుకు కారణం వారు ఆ పంటపై మెలుకువలను నేర్చుకుని, పాటించడమేనని కలెక్టర్ తెలిపారు. ఆర్గానిక్ ఫార్మింగ్‌తో అధిక లాబాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ తిరుపతిరెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిసాన్ మేళా.. కిటకిట

మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు మహోత్సవం విజయవంతమైంది. జిల్లా కేంద్రాలకే పరిమితమయ్యే కిసాన్ మేళాలు వ్యవసాయిక ప్రాంతమైన హుస్నాబాద్‌లో నిర్వహించడం రైతులకు ప్రయోజనకరంగా మారింది. ఈ కిసాన్‌మేళాలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలు, బ్యాంకులు ఇతర రంగాలకు చెందిన 150 స్టాళ్లను ఏర్పాటు చేయగా, మూడు రోజుల పాటు కిటకిటలాడాయి. హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్, దుబ్బాక సిద్దిపేట డివిజన్‌లతో పాటు హన్మకొండ, జనగామ, కరీంనగర్ జిల్లాలకు చెందిన దాదాపు 13 వేల మంది రైతులు మేళాలో పాల్గొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, అధికారులు చెప్పిన సాగు అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ముఖ్యంగా మేళాలో సాగు యంత్రాలను రైతులు ఆసక్తిగా పరిశీలించారు. ఆదివారం మేళాలో చేపల ఫ్రైకీ మంచి స్పందన లభించింది. ఒక ముక్క ఫ్రైని రూ.60కి విక్రయించారు. మృగశిర కార్తె రోజున చేపలు తినాలనే ఉద్దేశంతో తీసుకున్నామని రైతులు తెలిపారు.

10 వేల కోడిపిల్లలకు ఆర్డర్ వచ్చింది



తొమ్మిది సంవత్సరాలుగా ప్రభుత్వ సహకారంతో కడక్‌నాథ్, సోనాలీ, అసీల్, గిరిరాజ కోళ్లను పెంచుతూ కోడి పిల్లలను విక్రయిస్తున్నాం. హుస్నాబాద్ కిసాన్ మేళాలో స్టాల్‌ను ఏర్పాటు చేయగా మూడు రోజుల్లో 30 మంది నుంచి 10 వేల కోడి పిల్లలను కొనుగోలు చేసేందుకు ఆర్డర్ వచ్చింది. మాకు ఎంతో సంతోషం అనిపించింది.

- పల్లె సతీష్, రామగుండం



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

కష్టార్జితాన్ని ప్రైవేట్ పాఠశాలలకు దారపోయొద్దు

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తొగుట మండలం మెట్టు, పెద్దమాసాన్‌పల్లి గ్రామాల్లో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధునిక సాంకేతికలో భాగంగా బోధనలోకి మిషన్ లాంగ్వేజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలను తీసుకొచ్చామన్నారు. పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి కంప్యూటర్లను అందజేస్తామని చెప్పారు. తల్లిదండ్రులు తమ సంపాదనను ప్రైవేట్ పాఠశాలలకు దారపోయొద్దని సూచించారు. పాఠశాలలో ప్రత్యేకంగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నర్సయ్య, చేతిరాత నిపుణులు యాదగిరి, యోగా అభ్యాసకులు పూజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెద్దమాసాన్‌పల్లి పాఠశాల కోసం ఫైర్ సేఫ్టీ మెటీరియల్‌ను డీఈవోకు అందజేస్తున్న పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్

రంగధాంపల్లి సమీపంలో వ్యక్తి హత్య

సిద్దిపేట అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అర్బన్ మండలం రంగాధాంపల్లిలోని మయూరి రెస్టారెంట్ వెనుకాల గల ఖాళీ స్థలంలో వ్యక్తి హత్యకు గురైనట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ ఆదివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన బోదాస్ నర్సింహులు(40)ను గుర్తు తెలియని వ్యక్తులు చంపి ఉంటారని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం క్లూస్ టీం తో వివరాలు సేకరిస్తున్నారు. త్వరలో కేసును ఛేదించి నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల విడిది

చివరి వారం.. భక్తిపారవశ్యం

హుస్నాబాద్ ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన జనం

హుస్నాబాద్ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతర ముగింపునకు చేరుకున్నది. ఈ నెల 11వ తేదీన జాతర ముగియనున్నది. ఈ ఆదివారం చివరివారంతో పాటు సెలవు దినం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఒడిబియ్యం, పట్నాలు, బోనాలు సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ పరిసరాలు ఎటు చూసినా జనంతో సందడిగా కనిపించింది. కటుంబంతో సహా వచ్చిన భక్తులు చెట్ల కింద, టెంట్ల కింద వంటలు వండుకుని, భోజనాలు చేశారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు

మల్లన్న ఆలయం.. జనసందోహం

చేర్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆదివారం ఆలయ సన్నిధి భక్తజన సందోహంగా మారింది. ఇంటిల్లిపాది తరలివచ్చి మల్లన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిలుక, నజరు, ముఖమండపు పట్నాలు సమర్పించి వేడుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ఒడిబియ్యం, బండారి, పట్టు వస్త్రాలు సమర్పించారు. తమ కోర్కెలు ఈడేర్చమని గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని బెల్లం పానకం క ల్లు శాఖ పెట్టారు. దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తీ



ములుగు పీహెచ్‌సీలో సమస్యల తిష్ట 7
వర్షం పడితే లోపలంతా నీరే
ప్రహరీ లేక పందుల స్వైరవిహారం

దౌల్తాబాద్‌కు డిగ్రీ కళాశాల కలేనా! 8

టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



కొండపాక మండలం దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వైపు ఆదివారం సాయంత్రం వాహనాల సంఖ్య పెరిగింది. మరో రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానుండడంతో సెలవులకు వచ్చివారు హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండడంతో రద్దీ ఎక్కువగా ఉన్నది. సుమారు కిలో మీటరు దూరం వాహనాలు నిలిచిపోయాయి.

- కొండపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి)



కుంగ్‌ఫూలో ప్రణతికి బ్లాక్‌బెల్ట్



కుంగ్‌ఫూలో బ్లాక్‌బెల్ట్‌లో ఫస్ట్ డిగ్రీ సాధించిన ప్రణతి

సంగారెడ్డి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలం తేర్పోల్ గ్రామానికి చెందిన సీహెచ్. ప్రణతి కుంగ్‌ఫూలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా, ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన సమ్మర్ కోచింగ్ ముగింపు క్యాంపులో ప్రణతి పాల్గొని ప్రతిభ కనబర్చారు. బ్లాక్‌బెల్ట్ సాధించిన ప్రణతికి బీజేపీ రాష్ట్ర నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే చేతుల మీదుగా బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డిగ్రీని అందజేసి అభినందించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

హత్నూర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కంసానిపల్లి నర్సింలు తన ఎద్దులను తీసుకొని మేత కోసమని గ్రామ శివారులోకి వెళ్లాడు. వసీంకుంట సమీపంలో ఎడ్లు మేత మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.లక్ష విలువ గల ఎద్దు మృతిచెందడంతో నర్సింలు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రారంభానికి నోచుకోని వైకుంఠధామం

● మంత్రి చేతులమీదుగా ప్రారంభించేందుకు యత్నం
● పంతాలకు పోకుండా వినియోగంలోకి తేవాలని స్థానికుల వేడుకోలు



నర్సాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న ఆధునిక వైకుంఠధామంలోని నిర్మాణాలు

నర్సాపూర్, జూన్ (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లోని శ్మశానవాటికలోని స్థలంలో రూ.కోటితో ఏడాది క్రితం నిర్మించిన వైకుంఠధామం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఈ వైకుంఠధామంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా స్నానాల గదులు, దహన క్రియలకు రెండు ప్లాట్‌ఫాంలు, అంత్యక్రియలకు పూర్తయ్యే వరకు సంబంధీకులు వేచి ఉండే గది, దింపుడుకల్లం, కలప నిల్వకు గది, ఆఫీసు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇన్ని సదుపాయాలతో నిర్మించిన వైకుంఠధామాన్ని వినియోగంలోకి తేకపోవడంతో గోడలకు పగుళ్లు వస్తున్నాయి. అంతే కాకుండా అందులోని సామగ్రి చోరీకి గురవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే సునీతారెడ్డి ఉండటంతో అధికార కాంగ్రెస్ నాయకులు మంత్రి చేతులమీదుగా ప్రారంభం చేయించాలని చూస్తుండడం వల్ల జాప్యం జరుగుతుందన్న ప్రచారం స్థానికంగా ఉన్నది. ఇప్పటికైనా పంతాలకు పోకుండా వైకుంఠధామాన్ని వీలైనంత తొందరగా వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



శివ్వంపేటలో సైబర్ మోసం

● రూ.45,720 వేలు మోసపోయిన యువకుడు

శివ్వంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాడి చేతిలో మోసపోయిన సంఘటన శివ్వంపేట మండలం బిజిలిపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కట్టమీద శ్రీకాంత్(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఏప్రిల్ 25న ఉదయం 11 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి బంజారాహిల్స్ హైదరాబాద్‌లోని 'దని' వడ్డీ వ్యక్తిగత లోన్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని, హౌసింగ్ లోన్ రూ.10 లక్షలు ఇస్తామన్నాడు. శ్రీకాంత్ లోన్ తీసుకుంటానని చెప్పడంతో అదేరోజు సాయంత్రం 3 గంటలకు ఫోన్‌చేసిన వ్యక్తి సేవింగ్ ఎకౌంట్ ఉంటే లోన్ రాదని, కరెంటు అకౌంట్ నుంచి డబ్బులు పంపించాలనడంతో రూ.16,850 పంపించాడు. మళ్లీ 3.30 గంటలకు ఎన్‌వోసీకి రూ.1000, 26 ఏప్రిల్ ఉదయం 12 గంటలకు చార్జెస్ కింద రూ.1000 చెల్లించామని అడగ్గా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఓటీపీ వస్తుంది.. దానికి చార్జెస్ అవుతుందని రూ.8870 వేయాల్సిందిగా చెప్పడంతో అనుమానం వచ్చిన శ్రీకాంత్ మోసపోయానని సైబర్ టోల్‌ఫ్రీ నంబరు 1930 ఫోన్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● కోతులు అడ్డురావడంతో ప్రమాదం

నంగునూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కోతులు అడ్డు రావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. చిన్నకోడూరు మండలం సిక్కిందాపూర్ గ్రామానికి చెందిన జాలిగామ కనకవ్వ(60) బంధువుల గృహ ప్రవేశానికి నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామానికి బైక్‌పై వస్తుంది. గ్రామంలోని బద్దిపడగ శ్రీనివాస్ రెడ్డి ఇంటి ముందట కోతుల గుంపు అడ్డురావడంతో వెనకాల కూర్చున్న కనకవ్వ కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం సిద్దిపేట తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి గుడి కందుల భారతవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్ పేట పోలీసులు తెలిపారు.

'బడి' వీడుతున్న బాలలు

● ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం కరువు
● కుల వృత్తి వైపు మళ్లుతున్న పిల్లలు



మాసాయిపేటలోని వడ్డెర కాలనీ

మాసాయిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా మండల కేంద్రమైన మాసాయిపేటలోని వడ్డెర కాలనీలో ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం, బడి లేకపోవడంతో కాలనీల పిల్లలు బడికి దూరమవుతున్నారు. వడ్డెర కాలనీ జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. ఇక్కడి బండపై సుమారు 30 వడ్డెర కుటుంబాలు ఏళ్లుగా జీవిస్తున్నాయి. అయితే ఈ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం కానీ, పాఠశాల కానీ లేకపోవడంతో చిన్నారులు పాఠశాలలకు వెళ్లలేక కులవృత్తి వైపు మళ్లుతున్నారు. ప్రతీసారి ఓట్ల కోసం వచ్చిన నాయకులను కాలనీ ప్రజలు అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల కట్టించాలని విజ్ఞప్తులు చేసినా ఇప్పటికీ ఏర్పాటు కాలేదు. సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తమ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


రేషన్ బియ్యం కోసం పడిగాపులు



నవాబ్‌పేట్‌లో రేషన్ బియ్యం కోసం కూర్చున్న లబ్దిదారులు

శివ్వంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం కోసం ఉదయం 6 నుంచి సీరియల్ కోసం పడిగాపులు కాస్తున్నామని నవాబ్‌పేట్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నవాబుపేటలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మూడునెలల రేషన్ బియ్యం కోసం గంటల తరబడి నిరీక్షిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6 నుంచి బియ్యం కోసం ఆరుసార్లు వేలిముద్రకు దాదాపు గంట టైం పడుతుందని, రేషన్ బియ్యం తీసుకోవడం ఇబ్బందిగా మారిందని చెప్పారు. అధికారులు స్పందించి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.







ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

● ఒకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

చేగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన వడియారం బైపాస్ జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకున్నది. హైదరాబాద్ నుంచి వస్తున్న కారును హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తూప్రాన్ హెడ్ కానిస్టేబుల్ కిషన్ నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

● నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో ఘటన

ఫోటో;8ఎన్‌కెడి కెఎల్‌ఆర్‌పి 53 నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లి మరణించిన రాంరెడ్డిపేటకు చెందిన మృతదేహం

ఫోటో;8ఎన్‌కెడి కెఎల్‌ఆర్‌పి 54 పోతుగంటి గూల గంగారాం(ఫైల్ ఫోటో)

కల్హేర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట గ్రామానికి చెందిన పోతుగంటి గూల గంగారాం(48) ఆదివారం గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లాడు. వల వేసి చేపలు పట్టే క్రమంలో బలమైన ఈదురుగాలులు వీయడంతో థర్మాకోల్‌తో తయారు చేసిన తెప్ప తలకిందులై మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య దస్తవ్వ ఫిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతి

సంగారెడ్డి క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్టు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. మృతురాలి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని, బట్టలు ఉతుక్కునేందుకో.. లేదా కాలకృత్యాలు తీర్చుకునేందుకో వెళ్లి మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి గురించి తెలిసిన వారు పోలీసులకు సమాచారమందించాలని ఆయన కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాలోని బట్టను చిందరవందరగా పడేసిన దృశ్యం

చేగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన చేగుంట మండల కేంద్రంలోని హమాలీ కాలనీలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న చిటబోయిన ఆంజనేయులు పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగులగొట్టి మూడు తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.15 వేల నగదు చోరీకి పాల్పడ్డారు. రూ.4 లక్షల వరకు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

అప్పులబాధతో యువకుని ఆత్మహత్య



బర్రె మహేష్ (ఫైల్)

మాసాయిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన బర్రె మహేష్(30) తన స్నేహితుల వద్ద వ్యక్తిగత అవసరాల కోసం రూ.13 లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై శనివారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శభాష్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. చేగుంట మండలం చందాయిపేట్ గ్రామానికి చెందిన షాబుద్దీన్(45) సుమారు ఆరేళ్ల క్రితం బతుకుతెరువు కోసం కుటుంబ సభ్యులతో శభాష్‌పల్లి వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. 20 ఏళ్లుగా మద్యానికి బానిసైన షాబుద్దీన్ తరచూ భార్య, కొడుకుతో గొడవపడేవాడు. మే 18న షాబుద్దీన్ భార్య రషీద బేగం, కొడుకు సమిరుద్దీన్‌ను ఇంట్లోంచి వెళ్లిపొమ్మని కొట్టడంతో.. తూప్రాన్‌లో నివాసముంటున్నారు. కాగా ఈనెల 3న షాబుద్దీన్ కొడుకుతో ఫోన్‌లో మాట్లాడాడు. 7న బక్రీద్ పండుగ కావడంతో షాబుద్దీన్ తమ్ముడు మాంసం ఇచ్చేందుకు ఇంటికి వెళ్లాడు. తలుపులు మూసి ఉండడంతో పాటు దుర్వాసన రావడంతో తలుపులు తెరిచి చూసేసరికి షాబుద్దీన్ ఇంట్లో దూలానికి ఉరేసుకుని కనిపించాడు. కుమారుడు సమిరుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

మద్యం తాగించి.. సొమ్ము దొంగిలించాడు..

● తులం బంగారం, 50 తులాల వెండి అపహరణ



రామవ్వను బైక్‌పై తీసుకెళ్తున్న నిందితుడు

మనోహరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు చెప్పి మద్యం తాగించి మహిళ మెడలోంచి తులం బంగారం, 50 తులాల వెండితో ఉడాయించారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా, రాయపోల్ మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన మన్నే రామవ్వ శనివారం రాయపోల్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి పాములపర్తి గ్రామానికి పోయేందుకు గజ్వేల్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తున్నది. ఇంతలో ఓ మహిళ, ఓ వ్యక్తి అక్కడికి వచ్చి రామవ్వతో మాట కలిపారు. నువ్వు ఎక్కడికి వెళ్లాలి అని అడగ్గా.. పాములపర్తికి అని చెప్పింది. మేము అదే గ్రామానికి వెళ్తున్నామని మాయమాటలు చెప్పి బైక్‌పై ఎక్కించుకున్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామ శివారులోని క్యాతమ్మ ఆలయం వద్దకు చేరుకున్న ముగ్గురు మద్యం సేవించారు. ఇదే అదునుగా భావించిన సదరు వ్యక్తులు రామవ్వ మెడలో ఉన్న తులం బంగారం, 50 తులాల వెండి కడియాలతో పారిపోయారు. రామవ్వ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన అయినొనుద్దీన్(44) కూలీగా పనిచేస్తూ కిష్టాసాగర్ సమీపంలో రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం ప్రమాదవశాత్తు పాముకాటు వేసినట్లు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

డయల్ 100కు సత్వర స్పందన

నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులు



యూనూస్‌ను కాపాడిన పోలీసులు మహేందర్, మేషక్

సంగారెడ్డి క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకుంటున్నానని డయల్ 100కు ఫోన్ చేసి చెప్పిన ఓ వ్యక్తిని పోలీసులు మాటల్లో పెట్టి ఆత్మహత్య చేసుకోకుండా ఆపి నిండు ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని డబుల్ బెడ్‌రూమ్‌లో నివాసముంటున్న యూనూస్ కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆదివారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో డయల్ 100కు ఫోన్ చేశాడు. డయల్ 100కు వచ్చిన సమాచారంతో సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లు మహేందర్, మేషక్‌లు వెంటనే స్పందించారు. సదరు యూనూస్‌కు ఫోన్ చేసి మాటల్లో పెట్టారు. అతనితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఫసల్‌వాదిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్దకు హుటాహుటిన చేరుకున్నారు. నేరుగా అతని రూమ్ వెళ్లి యూనూస్‌ను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మనసు మార్చుకున్న యూనూస్‌ను అతని బాబాయ్ మౌలాలికి అప్పగించారు. సకాలంలో స్పందించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుళ్లు మహేందర్, మేషక్‌లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ క్యాంప్‌నకు ఎంపిక



శశ్రీత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

వెల్దుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన శశ్రీత్ గౌడ్ రాష్ట్రస్థాయి క్రికెట్ క్యాంపునకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ బీఎన్‌రెడ్డి నగర్‌లోని ఏవైఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో గత నెలలో జరిగిన యంగ్ స్టార్ క్రికెట్ లీగ్ నేషనల్ టోర్నమెంట్‌లోశశ్రీత్ గౌడ్ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి క్యాంపుకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. ఆదివారం విద్యార్థి స్వగ్రామమైన చర్లపల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగాసనా జడ్జిగా తోట సంధ్య



పంజాబ్‌లో శిక్షణ కార్యక్రమంలో సంధ్య, తదితరులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగాసనా జడ్జిగా సిద్దిపేటకు చెందిన ప్రముఖ యోగ శిక్షకురాలు తోట సంధ్య శిక్షణ పూర్తి చేసుకున్నారు. యోగాసనా భారత్ ఆధ్వర్యంలో ఎన్ఐఎస్ సెంటర్ పటియాల పంజాబ్‌లో నేషనల్ జడ్జెస్ ట్రైనింగ్‌లో రాష్ట్రం నుంచి ఆరుగురు పాల్గొన్నారు. ఇందులో తోట సంధ్య పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆమెను తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ఈట అరవింద్, విక్రం రెడ్డి, అంజయ్య చిప్ప ప్రభాకర్, హరిప్రసాద్, బసవరాజు కుమార్ తదితరులు అభినందించారు.

మెట్రోని సంగారెడ్డి వరకు విస్తరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

సంగారెడ్డి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జనాభా, రద్దీని ప్రాతిపదికగా తీసుకుని మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైల్‌ను విస్తరించాలని సీడీఆర్‌పీ సిబ్బంది ప్రతినిధి ప్రధాన కార్యదర్శి అజయ్ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. భారీ పరిశ్రమలు ఉన్న పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు 21 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించడం అత్యవసరమన్నారు. మెట్రో ఫేజ్ 2 ప్రణాళికను పునంపరిశీలించి పటాన్‌చెరు నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా సంగారెడ్డి వరకు 21 కిలో మీటర్లు విస్తరణను చేర్చాలని లేఖలో కోరారు.

నిజాంపేటలో చేప ప్రసాదం పంపిణీ



చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న తడకంటి కుటుంబ సభ్యులు

నారాయణఖేడ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మడల కేంద్రంలో మృగశిర కార్తెను పురస్కరించుకుని ఆదివారం తడకంటి కుటుంబ సభ్యులు చేప ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ప్రసాదం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 82 సంవత్సరాలుగా తడకంటి కుటుంబం ఇక్కడ చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తోంది. ఈ ప్రసాదం కోసం ఈ ప్రాంతవాసులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వారు కూడా పెద్ద ఎత్తున వస్తుంటారు. తడకంటి పర్వాగౌడ్, తడకంటి లింగాగౌడ్, నాగరాజ్‌గౌడ్, సాయిబాబా గౌడ్, వెంకటేష్‌గౌడ్, శంకర్‌గౌడ్ చేప ప్రసాదం తినిపించారు. మాంసహారం తినని వారికి బెల్లంలో ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల నుంచి ఆదిలాబాద్ వరకు ఆలయాలు



తూప్రాన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గద్వాల నుంచి ఆదిలాబాద్ వరకు ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయాలను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నట్లు శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ ముదిరాజ్ పేర్కొన్నారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన శ్రీపెద్దమ్మ ఆలయ విగ్రహ, ధ్వజస్థంభ ప్రతిష్ఠాప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెద్దమ్మ ఆలయాల నిర్మాణానికి ముదిరాజ్‌లు ఐక్యంగా కదలుతున్నారని, దేవాలయాల నిర్మాణం ఐక్యతకు నిదర్శనమన్నారు. ఆలయాల నిర్మాణాలకు భిన్నమైన కులాలు కూడా సహకరిస్తున్నారని, ఆలయాల నిర్మాణం ప్రశాంతతకు నిలయాలు అన్నారు. ప్రభుత్వాలు కూడా ఆలయాల నిర్మాణాలకు 20 శాతం చెల్లిస్తే 80శాతం అందజేయడంతో నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు గడిచిపోయినా ముదిరాజ్‌లు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. అందరితో సమానంగా ఎదగాలని, పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని బండ ప్రకాష్ ఆకాంక్షించారు. ఇందులో గ్రామస్థులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు అందుబాటులో

సూపర్ స్పెషాలిటీ





వంద పడకలతో ఆస్పత్రి

పారిశ్రామిక వాడలో ఏర్పాటు

త్వరలోనే అందుబాటులోకి..

సిద్ధం చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ప్రజలకు ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల వారికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లోని రసాయన పరిశ్రమల్లోని కార్మికులకు అధునాతన వైద్య సేవలు అందించాలనే హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం, ఈ ప్రాంత పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువస్తోంది. మరో 40 రోజుల్లో ఈ ఆస్పత్రిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం పూర్తిగా డ్రగ్ పరిశ్రమలకు హబ్‌గా మారింది. రసాయనాల బారిన పడిన కార్మికులు మృత్యువాత పడుతున్నారు. అలాంటి వారికి పూర్తిస్థాయి వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని సంకల్పించారు. ఇందుకు రూ.188 కోట్లు అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. ఇందులో 25శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగా, మిగిలిన నిధులు పరిశ్రమల యజమానులు ఇస్తున్నారు. ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వందపడకల ఆసుపత్రి భవనంతో పాటు ఆసుపత్రి పరికరాలు కొనుగోలు చేయడానికి రూ.70కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా లెక్కలు వేశారు. రూ.21.5 కోట్లతో ఆన్‌లైన్ విధానంలో టెండర్లు పిలిచి ఆస్పత్రికి అవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన రూ.118 కోట్లు 10 ఏళ్ల పాటు ఆస్పత్రిలో వైద్యులతో పాటు రెండు వందల మందికి వేతనాలు కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షణలో చెల్లించనున్నారు.

సేవలు ఇలా...

జిల్లాలో మొదటిసారి 100 యూనిట్ల రక్తం నిల్వ సామర్థ్యం కలిగిన బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లేనందున వైద్య విద్యార్థులు ఇక్కడ సూపర్ స్పెషాలిటీ కోర్సు పూర్తి చేసేందుకు అవకాశం కల్పిస్తారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు గాయాలపాలయిన వారికి మందులతో కాకుండా ఫిజియోథెరపీ విధానంలో చికిత్సలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక అంతస్తు పూర్తిగా ఇందుకోసమే కేటాయిస్తున్నారు. కిడ్నీ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. సిటీ స్కాన్‌తో కూడిన ఐసీయూ వార్డు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ మెడికల్ సర్జన్, ఆర్థోపెడిక్, నరాలకు సంబంధించిన అన్ని రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేకంగా గైనకాలజీ విభాగం ఏర్పాటు చేస్తున్నారు. అన్ని రకాల ల్యాబ్‌ల్లో పరీక్షలు జరుగుతాయి. ఎన్ఐసీయూ కార్డియాలజీ, డయాలసిస్, ఎంఐసీయూ, న్యూరో, కార్డియాక్ ఐసీయూ, గైనకాలజీ, సర్జరీ, జనరల్ మెడిసిన్ వంటి వార్డులు ఉంటాయి. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ, క్యాత్ ల్యాబ్‌లతో పాటు ఐదు వెంటిలేటర్లను అందుబాటులో ఉంచనున్నారు. వీటికి సేవలు అందించేందుకు 38 మంది సూపర్ స్పెషాలిటీకి చెందిన వైద్యుల నియామక ప్రక్రియ పూర్తి చేశారు. వీరు ప్రస్తుతం ఇతర ఆసుపత్రుల్లో డిప్యూటేషన్ పద్దతిలో పని చేస్తున్నారు. మరో 150 మంది స్టాఫ్, హెడ్ నర్సులతో పాటు కిందిస్థాయి సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తిచేశారు. ఇప్పటికే ఉన్న వందపడకల ఏరియా ఆసుపత్రికి అనుసంధానం చేసేటట్టు చర్యలు తీసుకుంటారు. రెండు ఆసుపత్రుల భవనాల్లో రాకపోకలు సాగించేందుకు వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన ఆమోదం పొందలేదు.

ప్రారంభానికి సీఎంను ఆహ్వానిస్తా..

కార్మికుల కల సాకారం చేసాం. అన్ని రకాల కార్పోరేట్ వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నాం. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుడికి ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. కాలుష్య ప్రభావిత అన్ని గ్రామాల ప్రజలు ఉచితంగా వైద్యసేవలు వినియోగించుకోవచ్చు. ఇందుకు రెండు వందల కోట్లు ఖర్చు చేశాం. అన్ని రకాల వైద్యులు అందుబాటులోకి రానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపచేసేందుకు ఆలోచన చేస్తున్నాం.

- మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే, పటాన్‌చెరు

40 రోజుల్లో అందుబాటులోకి..

జిల్లాలో మొదటిసారి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల తరహాలో వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే వైద్యుల నియామక ప్రక్రియ పూర్తయింది. పరికరాల కొనుగోలు చేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. ల్యాబ్‌లు, మంచాల అమరిక పనులు జరుగుతున్నాయి. మరో 40 రోజుల్లో ఆస్పత్రిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, పటాన్‌చెరు

కిటకిటలాడిన నాచగిరి, విద్యాధరి క్షేత్రాలు



విద్యాధరి క్షేత్రంలో సామూహిక అక్షర స్వీకారాలు



నాచగిరిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచగిరి లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం, వర్గల్ విద్యాధరి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. నాచగిరి క్షేత్రంలో లయ వేద పండితులు హోమం నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు వేలాది మంది తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను ఆలయ అధికారులు చేశారు. వర్గల్ విద్యాధరి క్షేత్రంలో చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు చేయించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్న ప్రసాదాలను అందజేశారు.



మెదక్ సీఎస్ఐ చర్చిలో భక్తుల సందడి

మెదక్ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, ఈ ప్రార్థలకు రాష్ట్రంతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలించ్చారు. దీంతో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం భక్తులతో కిక్కిరిసింది. చర్చి ఆవరణ మొత్తం ఏసు నామ స్మరణతో మారుమోగింది. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన సిలువ ముందు భక్తులు కొబ్బరి కాయలు కొడుతూ, కొవ్వొత్తులు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. మత గురువులు భక్తులను ఆశీర్వచనలందించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తీ



శిథిలావస్థలో ములుగు ఆసుపత్రి భవనం



ఆస్పత్రి ఆవరణలో కూలిపోయిన నీటి సంపు

ములుగులో తిష్ఠవేసిన సమస్యలు

వర్షం పడితే లోపలంతా నీరే

ప్రహరీలేక పందుల స్వైరవిహారం

ములుగు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అక్కడ పని చేసే సిబ్బంది తాగేందుకు నీరుండదు కానీ, వర్షం వస్తే మాత్రం ఆ ఆస్పత్రిలోకి మాత్రం నీరు చేరుతుంది. ఇక నీటి సంపు కూలిపోయి ఏళ్లు కావొస్తోంది. ప్రహరీ లేక ఆస్పత్రి ప్రాంగణంలో పందులు స్వైర విహారం చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే సిద్దిపేట జిల్లా ములుగు ప్రభుత్వ ఆస్పత్రి సమస్య సుడిగుండంలో చిక్కుకుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ములుగులో ప్రభుత్వాసుపత్రిని నిర్మించారు. అప్పుడు నాణ్యత లేని నిర్మాణం చేపట్టడంతో వర్షం పడినప్పుడల్లా పై కప్పు నుంచి నీరు లోపలికి రావడంతో గోడలు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో పెచ్చులు ఊడిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొత్తగా ప్రభుత్వాసుత్రులు నిర్మించారు. అందులో భాగంగా మండల కేంద్రమైన ములుగు ఆసుపత్రికి కూడా నూతన భవనం మంజూరైంది. ప్రభుత్వం మారడంతో నూతన భవనం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటివరకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మరమ్మతులు చేపట్టాలి

ములుగు ప్రభుత్వ ఆస్పత్రి భవనం వర్షం వస్తే ఉరుస్తోంది. నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. అప్పటి వరకు తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలి. భవనంలో సమస్యలు ఉండటంతో సిబ్బందితో పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

-దీప్తి, వైద్యాధికారి





ఎంపీ రఘునందన్‌ను సన్మానిస్తున్న నాయకులు, మనూరులో ఎంపీ సురేష్ షెట్కార్ పూజలు

ఆలయాల్లో మెదక్ ఎంపీ పూజలు

దుబ్బాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆదివారం పలు ఆలయాల్లో పూజలు చేశారు. దుబ్బాకలోని నల్లపోశమ్మ దేవాలయంను ఆయన సందర్శించారు. బాబాజగ్జీవన్‌రామ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ ఉత్సవ నిర్వాహకులు, బాబూజగ్జీవన్‌రామ్ సంఘం నాయకులు చెక్కపల్లి రాజమల్లుతో పాటు సంఘం సభ్యులు సన్మానించారు.

ఎల్లమ్మ దేవాలయంలో..

తొగుట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం ఎంపీ రఘునందన్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకల్లో సంగారెడ్డి ఎంపీ

నారాయణఖేడ్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని మనూరు క్రాస్ రోడ్స్ వద్ద ఆదివారం మూడవ రోజున లలితాంబిక దేవి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శ్రీచక్ర స్థాపన, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప, బర్దీపూర్ పీఠాధిపతి అవదూత్‌గిరి మహారాజ్, దుద్యాల పీఠాధిపతి అంబికా శివయోగి మహారాజ్ పాల్గొన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు.





పట్టుదలతో ప్రపంచ రికార్డు

35 ఏళ్ల వయస్సులో పరుగుపందెం

6.25 సెకండ్లలో 60 మీటర్లు

యోగాలోనూ ప్రావీణ్యం

ఉచిత శిక్షణ ఇస్తున్న యోగా గురు

సంగారెడ్డి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయన యోగా గురు. యోగా పాఠాలు చెప్పడం వరకే పరిమితం కాలేదు. 35 ఏళ్ల వయస్సులో ప్రపంచ రికార్డును నెలకొల్పారు. అది కూడా తాను మొదటి నుంచీ సాధన చేస్తున్న యోగాలో కాదు... పరుగు పందెంలో. యోగా మాస్టర్‌గానే కాకుండా, పరుగుపందెంలో తనకంటూ ప్రత్యేకత చాటుతున్నారు బాచంపల్లి అజయ్‌కుమార్.

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన సురేందర్, రుక్మిణి దంపతుల కుమారుడు అజయ్‌కుమార్. తండ్రి సురేందర్ టీడీఎఫ్ ఉద్యోగి. యోగా గురువు కావడంతో పరిశ్రమలో యోగా శిక్షణనందించేవారు. బాల్యం నుంచి తండ్రినే గురువుగా భావించి యోగాభ్యాసంలో ప్రావీణ్యం పొదారు అజయ్‌కుమార్. తండ్రి వద్ద శిక్షణ ప్రారంభించిన అజయ్‌కుమార్ 2006లో రామ్‌దేవ్ బాబా హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పిల్లల క్యాంపునకు హాజరయ్యారు. 2009లో హరిద్వార్‌లో యోగా టీచర్‌గా శిక్షణ పొంది 8 సంవత్సరాల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో యోగాలో సేవలందించారు. 2017లో సంగారెడ్డికి వచ్చి యోగా శిక్షకుడిగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణనందిస్తున్నాడు. ప్రస్తుతం సంగారెడ్డి కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న పార్కులో ఉచిత యోగ శిక్షణ ఇస్తున్నారు.

పరుగుపందెంలో ప్రపంచ రికార్డు

● 2025 ఏప్రిల్ 3 నుంచి 7 వరకు నేపాల్ దేశంలో ఎస్‌టీకేఎఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పరుగు పందెంలో టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రీడాపోటీల్లో ఇండియా, బుటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సంగారెడ్డికి చెందిన అజయ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చి 60 మీటర్లు, 100, 200 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. 35 ఏళ్ల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో 6.25 సెకన్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాధించారు. అలాగే, రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయిలో 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 100, 200 మీటర్ల పరుగు పందెంలో 2 వెండి పతకాలు, రాష్ట్ర స్థాయిలో 200 మీటర్ల పరుగు పందెంలో 4 బంగారు, ఒకటి వెండి పతకాలు, జాతీయ స్థాయిలో 100, 200 మీటర్ల పరుగు పందెంలో ఒకటి బంగారు, 2 వెండి పతకాలు, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 100, 200 మీటర్ల పరుగు పందెంలో 3 బంగారు పతకాలు, వీటితో పాటు యోగా చాంపియన్‌షిప్‌లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన చాంపియన్‌షిప్‌లలో బంగారు, వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



అవహేళన చేశారు..

60 మీటర్ల పరుగు పందెంలో ప్రపంచ రికార్డు సాధించడం 35 వయసులో సాధ్యం కాదని అందరు అవహేళన చేశారు. కానీ, పట్టుదలతో సాధించాను. యోగా చేసినందువల్లే పరుగుపందెంలో ప్రపంచ రికార్డు సాధించగలిగాను. ప్రస్తుతం యోగా సమ్మర్ ఫ్రీ క్యాంప్ ఉదయం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు మంగళ, గురు, శనివారాల్లో శిక్షణ అందిస్తున్నాను.

-బాచంపల్లి అజయ్‌కుమార్, యోగా గురు

దౌల్తాబాద్‌కు డిగ్రీ కళాశాల కలేనా!

● మధ్యలోనే చదువు మానేస్తున్న నిరుపేద పిల్లలు ●అవస్థలు పడుతున్న విద్యార్థులు ●అమలు కాని నేతల హామీలు

దౌల్తాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రంలో స్థానికంగా డిగ్రీ కళాశాల లేక నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దురమవుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలయ్యేనా అని ప్రజలు, విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు సందేహ పడుతున్నాయి. 2019, 2024 ఎన్నికల ప్రచారంలో మండల కేంద్రానికి అన్ని పార్టీలకు చెందిన నాయకులు వచ్చినప్పుడు దౌల్తాబాద్‌కు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలను గెలుపోటముల తర్వాత ప్రజా ప్రతినిధులు మరచిపోయారు.

విద్యార్థుల అవస్థలు

దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది, మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ వరకు, లింగరాజుపల్లి వద్ద ఉన్న ఎంజేపీ పాఠశాలలో ఇంటర్ వరకు, శేరిపల్లి సమీపంలో మెండి చంత వద్ద ఉన్న ఎంజేపీ బాలికల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దౌల్తాబాద్‌లో డిగ్రీ కళాశాల లేక ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీ కోసం రామాంపేట, గజ్వేల్, సిద్దిపేటకు వెళ్లుతున్నారు. దౌల్తాబాద్ మండలంలోని 24 గ్రామ పంచాయతీలల్లో , 35ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1,550 మంది అమ్మాయిలు, 15,60 మంది అబ్బాయిలు మొత్తం 3 వేల 100 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో చాలా మంది డిగ్రీ కళాశాల లేక చదువులు మధ్యలోనే మానేస్తున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు, మేధావులు, కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చొరవ చూపుదాం



గతంలో దివంగత ఎమ్మెల్యేలు, చెరుకు ముత్యం రెడ్డి, సోలిపేట రామలింగారెడ్డిల సహకారంతో ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేసుకున్నాం.ప్రస్తుతం విద్యార్థులు మధ్యలోనే విద్య నిలిచి పోకుండా వారి భవిష్యత్ కోసం ఆలోచించి ప్రజా ప్రతినిధులం, నాయకులం అందరం కలిసి దౌల్తాబాద్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం పాటు పడదామని కోరుతున్నా. దౌల్తాబాద్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అన్ని వసతులు పుష్కలంగా ఉన్నాయి. వచ్చే విద్య సంవత్సరం నాటికి దౌల్తాబాద్‌లో డిగ్రీ కళాశాల నిర్మాణం జరిగే విధంగా ప్రజా ప్రతినిధులు,నాయకులు కృషి చేయాల్సిన అవసరవ ఉంది.

-ఆది వేణుగోపాల్,దౌల్తాబాద్ మాజీ సర్పంచ్

వచ్చే విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



దౌల్తాబాద్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేక ఎక్కడెక్కడికో వెళ్లి అనేక రకాలుగా అవస్తలు పడుతున్నాం.ఇంటర్ తర్వాత డిగ్రీ పై చదువుల కోసం గజ్వేల్,రామాంపేట,సిద్దిపేట,తదితర ప్రాంతాలలోకి వెళ్లతున్నారు.కొంత మంది దూరం వెళ్లలేక మధ్యలోనే విద్యను అపేస్తున్నారు. వచ్చే విద్య సంవత్సరం నాటికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రజా ప్రనిధులను విద్యార్థుల పక్షాన కోరుతున్నా

-అరుణ్ లింగాయిపల్లి తాండ,దౌల్తాబాద్ మండలం

బీఆర్ఎస్‌కు కాళేశ్వరం భయం పట్టుకుంది

● కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



సమావేశంలో మాట్లాడుతున్న అత్తుఇమామ్

సిద్దిపేట , జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు కాళేశ్వరం భయం పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఎద్దేవ చేశారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కమిషన్ వేయడంతో అందులో పాలు పంచుకున్న అవినీతిపరులు ఆందోళన పడుతున్నారన్నారు. లక్షల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడ్డ నాయకులను, అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు.

రైతు మహోత్సవానికి తరలిన రైతులు

వర్గల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లో జరుగుతున్న రైతు మహోత్సవానికి వర్గల్ మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సుమారు 250 మంది తరలివెళ్లారు. అక్కడ వ్యవసాయ యాంత్రీకరణ యంత్రాలు, డ్రోన్ పరికరాలు, ఉద్యానవన పంటలు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విడుదల అయిన కోత వంగడాలు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు అనిల్‌కుమార్, శేషశయన, ఏఈవోలు సంతోష్, సునీత, భారతి, సుప్రజ, తేజస్వీ, కృష్ణరెడ్డి, బాలు యాదవ్, మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

వంటల మెనూపై శిక్షణ



శిక్షణలో భాగంగా వంటలు చేసిన కుక్స్

సిద్దిపేట కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన శుచికరమైన భోజనాన్ని న్యూ మెనూ ప్రకారం క్రమం తప్పకుండా అందించాలని జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ రంగనాథ్ సూచించారు. సిద్దిపేట జిల్లాలోని కేజీబీవీ, యుఆర్ఎస్, టీఆర్ఈఐఎస్, బాలికల వసతి గృహాలకు సంబంధించిన 114 మంది వంటచేసేవాళ్లకు (కుక్స్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మోబిలైజింగ్ ఆఫీసర్, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ రంగనాథ్ పాల్గొని మాట్లాడారు. తినే ఆహారం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, అలాకాకుండా సమయ పాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్శియా, ఎస్ఓలు కృష్ణవేణి, భాగ్యలక్ష్మి, స్వప్న, స్వర్ణ, రంజని తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ మండల కమిటీ నియామకం

వర్గల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ఆదేశాల మేరకు ఆదివారం వర్గల్ మండల భారతీయ జనతా పార్టీ మండల కమిటీ నియామకం చేసినట్లు మండల పార్టీ అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి తెలిపారు. మండల పార్టీ ఉపాధ్యక్షులుగా బండ్ల రవీందర్, జంగం యాదగిరి, దిండి నాగరాజు, మటం మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా పంజాల వెంకటేశ్వర్ గౌడ్, పంపరి రమేశ్, కోశాధికారిగా నేతి శ్రీనివాస్, కార్యదర్శులుగా గుండుకాడి జ్ఞానేశ్వర్, కుమ్మరి రమేశ్, గోల్ల సాయి యాదవ్, ఎర్రవల్లి శ్రీనివాస్‌రెడ్డిలు నియామకమైనట్లు తెలిపారు. కొత్త కార్యవర్గం పార్టీ పురోభివృద్ధికి పాటు పడుతామని చెప్పింది.

మాది ప్రజాసంక్షేమ రాజ్యం

●కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



ప్రమాణస్వీకారోత్సవంలో నూతన చైర్మెన్ గాంధారి నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, జూన్8 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం నిరంతరం పని చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమనీ, తమది ప్రజాసంక్షేమ రాజ్యమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతులకు 2లక్షల రుణమాఫీ, రైతుల పెట్టుబడి సహాయంగా రైతు భరోసాను అందిస్తున్నామని ఆయన అన్నారు. ఆదివారం దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆత్మకమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షుడు గాంధారి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతుందన్నారు. ముఖ్యంగా రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేసిన ప్రభుత్వం తమదన్నారు. గృహాలకు గృహజ్యోతి ద్వారా 2వందల యూనిట్ల ఉచితవిద్యుత్‌ను, మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని అందించామన్నారు. ఏనాడు కూడా గత ప్రభుత్వాలు ఆలోచించని విధంగా మహిళల కోసమే వంటగ్యాస్‌లో 5వందల సబ్సిడీతోపాటు గత ప్రభుత్వం అందించలేని నూతన రేషన్‌కార్డులను తాము అందిస్తున్నామన్నారు. రైతుల సంక్షేమం కోసమే ఆత్మకమిటీయని, ఆత్మకమిటీ నూతన పాలకమండలి రైతుల సంక్షేమం కోసం పని చేయాలన్నారు.

ముస్త్యాల ఆదర్శ పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు

చేర్యాల, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలంలోని ముస్త్యాలలోని ఆదర్శ పాఠశాలలో డీఈవో ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు తమ వృత్తిలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, స్కిల్ డెవలప్‌మెంట్‌కు మూడు రోజుల పాటు శిక్షణా తరగతుల్ని ప్రారంభిరచబోతెన్నట్లు ఎంఈవో కిష్టయ్య తెలిపారు. వృత్తి పరంగా ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తప్పక హాజరుకావాలని సూచించారు.

దేవాలయ సింహద్వారానికి పూజలు

సిద్దిపేట కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని మార్కండేయ దేవాలయానికి సంబంధించి సింహద్వారం ఇనుప చానల్ గేట్ బదులుగా టేకు ద్వారం నిర్మించే పనులకు పద్మశాలి సమాజం సభ్యులు పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ పూజారులు, పద్మశాలి సమాజం కార్యవర్గం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు

మాగంటి మరణం తీరని లోటు

●జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మాగంటి గోపినాథ్ ఆకస్మిక మరణం పట్ల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని, నియోజక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారని, హైదరాబాద్ రాజకీయాల్లో ఓ విలక్షణమైన స్థానాన్ని ఏర్పచుకున్నారని అన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాక్షించారు.

ముమ్మరంగా బడిబాట



రేబర్తిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతున్న ఉపాధ్యాయులు

మద్దూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ముమ్మరం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నందున పాఠశాలలను బలోపేతం చేసేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలల మోజులో మోసపోవద్దని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాల ఇంచార్జీ హెచ్ఎం బాకీ చంద్రభాను ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తామని తల్లిదండ్రులు హామీ ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, మల్లేశం, రఫత్ ఉమర్, ప్రశాంత్, కనకయ్య ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● డీసీసీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి



శ్రీరాంపూర్‌లో గజ స్తంభానికి భూమి పూజలో పాల్గొన్న నర్సారెడ్డి.

ములుగు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ములుగు మండలం శ్రీరాంపూర్ గ్రామంలో అంజనేయ స్వామి దేవాలయం ముందు ధ్వజస్తంభం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే మండల కేంద్రమైన ములుగులో టీస్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను ప్రవేశపెడుతుందన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

గజ్వేల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో బోర్ మోటార్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని, గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిని అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, సుబాష్ చంద్రబోస్, జహీర్, నక్క రాములు, జంగం రమేశ్‌గౌడ్, నేత రమేశ్ తదితరులున్నారు.

ఆరెపల్లిలో వికసిత కృషి సంకల్ప అభియాన్

రాయపోల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం ఆరెపల్లిలో కృషి విజ్ఞాన్ కేంద్రం(కేవీకే) మెదక్ జిల్లా కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. వ్యవసాయ సమాచారం పొందడానికి కిసాన్ సారథి పోర్టల్ గురించి తెలియజేశారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులు వివరించారు. డ్రైల్యాండ్ వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు డాక్టర్ శాలిని వివరించారు.

బీజేపీ సంకల్ప సభ

కుకునూరుపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కుకునూరుపల్లిలో మండల బీజేపీ సంకల్ప సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం, బీజేపీ 11 సంవత్సరాలు ప్రభుత్వ ఏర్పాటు పూర్తయిన సందర్భంగా సమావేశం నిర్వహించామని 11 సంవత్సరాలలో భారతదేశం చరిత్రలో నిలిచిపోయే విదంగా పలు నిర్ణయాలు, విజయాలు సాధించామని వారు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నకోడూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు (సోమవారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ చాంద్ పాషా ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు చంద్లాపూర్, కమ్మర్లపల్లి, అల్లీపూర్, మాచాపూర్, విఠలాపూర్, నారాయణరావుపేట మండలంలోని జక్కాపూర్ గ్రామాల్లోని 33 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

బీజేపీ సిద్దిపేట పట్టణ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నుకున్న బిజెపి సిద్దిపేట పట్టణ కార్యవర్గం

సిద్దిపేట క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్దిపేట పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా లక్కరసు కృష్ణ, లక్ష్మారెడ్డి, చెంది సత్యనారాయణ, గందె సంతోష్ కుమార్ ప్రధాన కార్యదర్శులుగా పిట్ల నరేష్, కెమ్మసారం సంతోష్ కార్యదర్శులుగా శివరాత్రి నగేష్,"పవన్ తేజ్ రెడ్డి, విరమల్లు సతీష్, బోయిని వినోద, అధికార ప్రతినిధిగా వెంకట్ రావు, బీసీ మోర్చా అధ్యక్షుడిగా అరికె యాదగిరి, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్ , కోశాధికారిగా ఏర్వ గణేష్ ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ పార్టీ మరింత బలపడడం కోసం నిబద్ధతతో పనిచేస్తామన్నారు. తమకు అవకాశం కల్పించిన ఎంపీ రఘునందన్ రావుకు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్‌కు , అధిష్టానం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గుండ్ల జనార్ధన్ పాల్గొన్నాడు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన తలారి కరుణాకర్(30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబానికి 11500 రూపాయల నగదు, 3500 నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చేపూరి సంతోష్, సభ్యులు గుంటుకు శ్రీనివాస్, కొడకండ్ల గ్రామస్థులు కర్నాల గణేష్, నరేష్, తలారి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మతల్లికి బోనాలు

బెజ్జంకి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుళ్ల శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు చెల్లించి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



గాగిల్లాపూర్‌లో బోనాలను నెత్తిన ఎత్తుకొని వెళ్తున్న మహిళలు

మల్లన్న దేవాలయంలో డొనేషన్ కౌంటర్ ప్రారంభం

చేర్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న స్వామివారి దేవాలయంలో డొనేషన్ కౌంటర్‌ను తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆదివారం కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడారు. స్వామివారి ప్రతిమ నాణాలు స్వామి వారికి ఇచ్చే విరాళాలు శాశ్వత పూజలు, శాశ్వత కల్యాణాలు, శాశ్వత నిత్యాన్నదాన పథకం విరాళాలతో పాటు దేవాలయ అభివృద్ధికి భక్తులు విరాళాలు అందజేయడానికి ఈ కౌంటర్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, ఆలయ ప్రధాన అర్చకుడు, స్థానాచార్యులు కుమార్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న స్వామి ఆలయంలో డొనేషన్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ

బెదిరించి ఫోన్, నగదు అపహరణ

గజ్వేల్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని బెదిరించి ఫోన్ నగదు అపహరించిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం జరిగింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హన్మకొండ జిల్లా వేలేరు మండలం ఎర్రవెల్లి గ్రామానికి చెందిన రేణ దామోదర్ వ్యక్తి గత పని నిమిత్తం గజ్వేల్ మీదుగా తూప్రాన్ వెళ్తుండగా మార్గమద్యలో గజ్వేల్‌లో తూప్రాన్‌కు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో లిఫ్ట్ తీసుకొని వెళ్దాం అని ఉండగా గుర్తు తెలియని వ్యక్తిని లిఫ్ట్ అడడగా, కొంత దూరం వెళ్లాక రేణ దామోదర్‌ను బెదిరించి కొట్టి తన వద్ద ఉన్న ఫోన్‌ను 3000వేల రూపాయలు ఎత్తికెళ్లినారు. రేణ దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పొదుపుతోనే భవిష్యత్‌కు భరోసా



అభయనిధి కింద ఆర్థిక సహాయం అందజేస్తున్న విధాతా పురుషుల పొదుపు సంఘం సభ్యులు

కొండపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని అధిగమించడానికి పొదుపు చేయడం ఏకైక మార్గమని కొండపాక మండలం మర్పడగ విధాతా పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు ఊడెం తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం మర్పడగ క్షేత్రంలో జరిగిన పొదుపు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దురదృష్టవశాత్తు సభ్యులు మరణిస్తే కుటుంబసభ్యులను ఆదుకునేందుకు అభయనిధిని ఏర్పాటు చేశామన్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జంగపల్లి నర్సింహులు మరణించగా ఆయన భార్య జంగపల్లి లక్ష్మికి పన్నెండువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశామని తెలిపారు. మర్పడగ గ్రామంలో ఇరవై మూడేళ్ళ క్రితం ఈ సంఘాన్ని ప్రారంభించామన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన ఫ్రెండ్స్ ఫర్ సొసైటీ సభ్యులు

కుకునూరుపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ ఫర్ సొసైటీ సభ్యులు పీటీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీనరసవ్వ పక్షవాత బాధితురాలుకు ఆర్థిక సహాయం అందజేశారు. లక్ష్మీనరసవ్వ గత కొన్ని రోజుల క్రితం పక్షవాతానికి గురైంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఆమెకి ఫ్రెండ్స్ ఫర్ సొసైటీ సభ్యులు రూ. 16వేలు అందజేశారు. సమాజసేవకి ఎప్పుడు ముందుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం, వెంకట్, కిరణ్, హనుమాన్‌దాస్, వేణుగోపాల్, వెంకటేశం, యాదగిరి, రామచంద్రం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



చిన్నకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువులతో ఎస్ఎస్‌సీ 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చిన్నకోడూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు (30 సంవత్సరాలకు) ఆదివారం అదే పాఠశాల ఆవరణలో ఒకచోట చేరారు. వారు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకొని బాగోగులను తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు.